క్లుప్తంగా

'ఆదికర్మ యోగి'పై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఆదికర్మ యోగి పథకంపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలోని ప్రజల అవసరాలు గుర్తించి, విజన్ మ్యాప్‌ను సిద్ధం చేయడమే ఈ కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆదికర్మ యోగి లక్ష్యమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో బి.చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక వైటీసీలో ఆదికర్మ యోగి పథకంపై మండల స్థాయి సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీడీఏ పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్ హాజరై, శిక్షణను ప్రారంభించారు. గిరిజన ఆదిమ తెగలను చైతన్యం చేసి వారి అభ్యున్నతికి కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వీరఘట్టం: గిరిజన గ్రామాల అభివృద్ధే ఆదికర్మ యోగి పథకం లక్ష్యమని ప్రోగ్రాం జిల్లా మాస్టర్ ట్రైనీ సోమేశ్వరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదికర్మ యోగి శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా గిరిజన గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. మండలంలోని చినగోర, కుంబిడి ఇచ్ఛాపురం గ్రామాలను ఈ పథకంలో భాగంగా అభివృద్ధి చేయడమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, ఎంపీడీవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందేలా చూడాలి

గరుగుబిల్లి: రైతులకు సాగుకు అవసరమైన యూరియా ఎరువు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి అధికారులను ఆదేశించారు. మండలంలోని గరుగుబిల్లి పీహెచ్‌సీ, పెద్దూరు రేషన్ డిపోలను ఆమె మంగళవారం తనిఖీ చేసి, అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో ఎరువుల కొరత, నిల్వల పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, అక్రమంగా ఎరువులను నిల్వ చేసినా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ ఎరువుల నిల్వలపై నిఘాను మరింత పెంచాలన్నారు. ఎరువుల దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. స్వమిత్వ సర్వే పక్కాగా చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ పి.బాల, ఎంపీడీవో జి.పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల ఆందోళన

పాలకొండ: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు మంగళవారం ఆందోళనకు దిగారు. స్థానిక పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.గౌరీశ్వరి మాట్లాడుతూ తమ వేతనాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని కోరారు. ఈ నెల 11న జరిగే జిల్లా మహాసభలకు తమ మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కురుపాం: గ్రామాల్లో సీజనల్ జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కరరావు ఆదేశించారు. మండలంలోని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని, పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి విజయమోహన్, మొండెంఖల్ వైద్యాధికారి బుద్దేస్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల భూములకు రక్షణ కల్పించండి

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని ఏనుగులగూడ గిరిజనులకు ఇచ్చిన డీపట్టా భూములకు రక్షణ కల్పించాలని, అలాగే వారిపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా సర్వే నంబరు 189లో దాదాపు 40 ఎకరాల భూమిని సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని, అందులో 20 మంది గిరిజనులకు 27.33 ఎకరాల డీపట్టా భూమిని అందివ్వగా అదే భూమిపై వీరఘట్టం మండలం, సంతనర్సిపురానికి చెందిన కొంతమంది రైతులు తమకు పట్టాలు ఉన్నాయని ఆ భూమిలోకి దౌర్జన్యంగా చొరబడుతున్నారని తెలిపారు. గిరిజన రైతులపై వారి దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కె.సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి.రాజు, జి.దమయంతి తదితరులు పాల్గొన్నారు.

576 లీటర్ల సారా ధ్వంసం

సీతంపేట: మండలంలోని సారాబట్టీలపై ఇప్పటివరకు చేసిన ఆకస్మిక దాడుల్లో పట్టుబడిన 576.5 లీటర్ల సారాను మంగళవారం ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. ఎక్కడైనా సారాబట్టీలు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



సీతంపేట: బస్టాండ్ కూడలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, నాయకులు



కురుపాం: మండల కేంద్రంలోని రావాడ కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత తదితరులు



జియ్యమ్మవలస రూరల్: చినమేరంగి సీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పాలకొండ రూరల్: నవగాం కూడలిలోని కార్యక్రమంలో జోహార్ వైఎస్సార్ అని నినాదాలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



వీరఘట్టం: తెట్టంగిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు



పాలకొండ: వెలగవాడలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



సీతంపేట ఏరియా ఆస్పత్రిలోని రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

రాజన్నా.. నిను మరువం..

జనహృదయ నేత, సంక్షేమ ప్రదాత, అభివృద్ధి విధాత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వాడవాడలా మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కార్యక్రమానికి హాజరై వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. జలయజ్ఞం పేరుతో రైతు గుండెల్లో అపర భగీరథుడిగా, ఆరోగ్యశ్రీతో పేదల ఊపిరిగా, అభివృద్ధిని చేతల్లో చూపించిన అసలు సిసలైన నాయకుడిగా జనం గుండెల్లో నిలిచి సజీవుడిగా ఉన్నారని వక్తలు కొనియాడారు. మరో వందేళ్లు గడిచినా ఆయనను ఈ రాష్ట్ర ప్రజానీకం మరువదన్నారు. ఆయన ఆశయ సాధనకు మనవంతు కృషి చేయాలని కోరారు. –పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామస్తులు



వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కొమరాడలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జనార్దనరావు, తదితరులు



కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో వైఎస్సార్‌విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు శరత్‌బాబు తదితరులు



గరుగుబిల్లి: ఖడ్గవలస జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అచ్యుతరావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు తదితరులు



గుమ్మలక్ష్మీపురంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ అమర్ రహే అని నినాదాలు చేస్తున్న ఎంపీపీ దీనమయ్య, నాయకులు



భామిని: కొరమలో వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



జియ్యమ్మవలస రూరల్: పెదమేరంగి జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

పక్కా భవనం మంజూరు చేయండి

భామిని: మండలంలోని బురుజోల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు పక్కా భవనం మంజూరు చేయించాలని కోరుతూ ఏఐఎం అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు, సిబ్బంది అంతా కలిసి ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. భామిని ఏపీ మోడల్ స్కూల్, బురుజోల పాఠశాలల సందర్శనకు విచ్చేసిన ఎమ్మెల్సీకి భవనం లేని కారణంగా విద్యార్థులు, సిబ్బంది పడుతున్న కష్టాలను తెలిపారు. అలాగే అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన భామిని మోడల్ స్కూల్ విద్యార్థులకు ఎమ్మెల్సీ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేశారు. కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లోని తాత్కాలిక ఉపాధ్యాయులను



బురుజోల పాఠశాల సందర్శనలో ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

పూర్తిస్థాయిలో నియమించేలా చూడాలని ఎమ్మెల్సీని కోరారు. కార్యక్రమంలో ఏఐఎం అసోషియేషన్ ప్రతినిధి ఎం.ప్రపుల్లకుమార్, ప్రిన్సిపాల్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఫీవర్ సర్వే చేపట్టాలి

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టి, జ్వరాలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టర్ కేవీఎస్ పద్మావతి అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ పరిధిలోని జర్నలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. ఎనీమియా యాక్షన్ కమిటీ మీటింగ్‌ను ప్రతినెలా మొదటి బుధవారం సచివాలయంలో నిర్వహించాలని తెలిపారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేపట్టాలని, అబా ఐడీ క్రియేట్ చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లి, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు.

తాగునీటి సరఫరాపై చిత్తశుద్ధి ఏదీ?

గరుగుబిల్లి: తాగునీటి సరఫరాపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు వి.దాలినాయుడు, జి.రామకృష్ణ, టి.గౌరీశంకరరావులు విమర్శించారు. మండలంలోని తోటపల్లి వద్ద ఉన్న నాగావళి హెడ్‌వర్క్స్, మోటార్లు, నీటి పంపులను వారు మంగళవారం పరిశీలించారు. నాగావళి నది నుంచి పార్వతీపురం పట్టణానికి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాపై అటు అధికారులకు..ఇటు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతోనే ప్రజలకు తాగునీరు అందక వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత కొన్నిరోజులుగా ఇన్‌ఫిల్టర్ బావుల్లోని మోటార్లు పనిచేయకపోవడంతో పట్టణానికి తాగునీరు అందడం లేదన్నారు. ఇప్పటికైనా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారులు హాజరు..రియల్టర్లు గైర్హాజరు..

కురుపాం: మండల కేంద్రంలోని మేజరుపంచాయతీ కార్యాలయంలో బొబ్బిలి పట్టణాభివృద్ధి సంస్థ)బుడా అధికారులు మంగళవారం నిర్వహించిన సమావేశానికి రియల్టర్లు(రియల్ ఎస్టేట్ వ్యాపారులు) గైర్హాజరయ్యారు. కురుపాం మేజరు పంచాయతీ పరిధిలోని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చేపట్టిన ఈ సమావేశానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులంతా హాజరుకావాలని అధికారులు కోరినప్పటికీ ఏ ఒక్కరూ హాజరుకాలేదు. దీంతో సమావేశానికి వచ్చిన బుడా అధికారులు మాత్రం వారి రాక కోసం చూసి చూసి వెళ్లిపోయారు. ఇదే విషయమై రియల్ ఎస్టేట్ వ్యాపారులను సంప్రదించగా తమకు సమాచారం లేదని, వార్తా పత్రికలో సమావేశం ఉందని చెబితే ఎక్కడెక్కడో ఉన్నోళ్లు ఎలా వస్తారని అంటున్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి సురేష్ పాల్గొన్నారు.

గిరిజనుల గృహప్రవేశం

భామిని: మండలంలోని కడంబాసింగి గ్రామంలో రెండు నిరుపేద గిరిజన కుటుంబాల వారు నిర్మించుకున్న రేకులఇళ్లల్లోకి మంగళవారం గృహప్రవేశం చేశారు. హోలీక్రాస్ సంస్థ వారు చెరో ఇంటికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం చేసి, రేకులఇళ్లు నిర్మించుకునేలా తోడ్పడ్డారు.

ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ గృహయజమానులకు ఇంటి తాళాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. కొత్త గృహం నిత్యం ఆనందం ఇవ్వాలని ఆకాంక్షించారు.

నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలి

సీతంపేట: గిరిజన విద్యార్థుల వసతిగృహాలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని ఐటీడీఏ పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, కాస్మోటిక్ సామగ్రి సరఫరాకు సంబంధించి, మంగళవారం టెండర్లు నిర్వహించారు. పీవో సమక్షంలో టెండరు బాక్సులు తెరిచి 42 రకాల సరుకులకు టెండర్లు చేపట్టగా ఔత్సాహికులు టెండర్లు దక్కించుకున్నారు. ఏ రకమైన సరుకుల్లో నాణ్యత లోపించినా చర్యలు



పీవో సమక్షంలో టెండర్ బాక్సులు తెరుస్తున్న అధికారులు

తప్పవని పీవో హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, జీసీసీ డీఎం సంధ్యారాణి, డీడీ అన్నదొర, జీసీసీ మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, ఏటీడబ్ల్యూవో సూర్యం పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అలరించిన కోలాటం

భామిని: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో మహిళలు చేసిన కోలాటం ప్రదర్శన అలరించింది. రెండు గ్రూపులుగా ఏర్పడిన మహిళలు భక్తిగీతాలకు లయబద్ధంగా డ్యాన్స్ చేసి ఆకట్టుకున్నారు.

సర్వేపై సమీక్ష

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామ సచివాలయంలో యువత నైపుణ్యాలకు సంబంధించి చేస్తున్న కౌశల్ సర్వేపై ఎంపీడీవో జి.పైడితల్లి మంగళవారం సమీక్ష నిర్వహించారు. యువతలోని నైపుణ్యాలు గణన చేసేందుకే ఈ సర్వే చేస్తున్నామని, ఎవరిలో ఏ నైపుణ్యం ఉందో దాని ఆధారంగా ఉపాధి శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి మార్గం చూపించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. సర్వే పక్కాగా జరగాలని సిబ్బందికి సూచించారు.

యూరియా కోసం రైతుల అవస్థలు

పాలకొండ: యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన యూరియా నిల్వలు లేకపోవడంతో మండల కేంద్రంలోని ప్రైవేటు ఎరువుల షాపులను రైతులు ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక సబ్‌కలెక్టరు కార్యాలయం సమీపంలోని ఓ ప్రైవేటు డీలరు వద్దకు ఎరువుల కోసం గత రెండు రోజులుగా రైతులు గుంపులుగుంపులుగా వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పడిగాపులు కాస్తే కొన్ని కిలోల యూరియానే దొరుకుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జంగిల్ క్లియరెన్స్

సీతంపేట: దోనుబాయి–పొల్ల దారిలో దోనుబాయి పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. రోడ్డుకు అడ్డగా పడిపోయిన చెట్లకొమ్మలతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, డొంకలను తొలగించారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

అన్నదానం

పాలకొండ రూరల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కొత్తవీధిలో మహాఅన్నదాన కార్యక్రమం మంగళవారం చేపట్టారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల వీధులు, ఇతర ప్రాంతాల ప్రజలు వచ్చి స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించి ఆరగించారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

సీతంపేట: స్థానిక వైటీసీలో నిర్వహిస్తున్న గిరిజన గర్భిణుల వసతిగృహాన్ని ఐటీడీఏ పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం సందర్శించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి మంచి పౌష్టికాహారం అందివ్వాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గర్భిణులతో మాట్లాడి సిబ్బంది ఏ విధంగా చూసుకుంటున్నారన్న విషయం అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయం కావాలి

జియ్యమ్మవలస రూరల్: ప్రజారోగ్యమే ధ్యేయంగా వైద్యారోగ్య సిబ్బంది సేవలందించాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు కోరారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. ప్రజలకు వైద్యసేవలు అందించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదన్నారు.

కొమరాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో పీహెచ్‌సీ వైద్యాధికారులు శిరీష, దేవేంద్రలు మంగళవారం సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు జ్వరాల బారినపడకుండా చూడాలని, అవసరమైన సలహాలు సూచనలు ప్రజలకు ఇవ్వాలన్నారు.

ఘనంగా వారాల పండగ

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట, లింగాలవలస, వెంకటరాజపురం, బిత్రపాడు, బట్లభద్ర తదితర గ్రామాల్లో వారాల పండగ మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వినాయక చవితి తర్వాత ఈ వారాల పండగ జరుపుకోగా గ్రామదేవతలకు కోళ్లు, చీరలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

పరామర్శ

పాలకొండ రూరల్: మండలంలోని బీఆర్‌పేట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తాడేల జ్ఞానానందం(63) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిలు ఆ గ్రామానికి మంగళవారం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆ తర్వాత జ్ఞానానందం అంత్యక్రియల్లో పాల్గొని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, పాలకొండ వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ తదితరులు ఉన్నారు.

నీటమునిగిన పంటపొలాలు

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని పంటపొలాలు నీటమునిగాయి. భాసూరు, రాజుపేట, తంపటాపల్లి, తుమరాడ, చింతాడ గ్రామ పరిసరాల్లోని వరిపొలాలు ఇప్పుడు చెరువుల్లా కనిపిస్తున్నాయి. ఇదే వాతావరణం ఇలాగే కొనసాగితే నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంకితభావంతో పనిచేయాలి

జియ్యమ్మవలస రూరల్: వైద్యారోగ్య సిబ్బంది అంతా అంకితభావంతో పనిచేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కేవీఎస్ పద్మావతి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించిన ఆమె.. ఆశ కార్యకర్తలు, వైద్యారోగ్య సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ఫీవర్ సర్వే చేసి జ్వరపీడితులు త్వరితగతిన వైద్యం పొందేలా చూడాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి

వీరఘట్టం: భవన నిర్మాణ కార్మిక చట్టాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.ఇందిర డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బార్నాలవీధిలోని భవన నిర్మాణ కార్మికులతో ఆమె మంగళవారం మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల కోసం ఈ నెల 8వ తేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

పాలకొండ: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులతో కలిసి మంగళవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం చేస్తోందని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

పాలకొండ రూరల్: మండల కేంద్రంలోని ఎరువుల షాపుల్లో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అయ్యప్ప ఎరువుల షాపులో అనధికారికంగా ఉన్న 127 యూరియా, 15 డీఏపీ బస్తాలను అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, ప్రభుత్వ నిర్దేశిత ధర కన్నా ఎక్కువకు అమ్మినా చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సీఐ రవికుమార్ హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి ఎస్.ఎ స్.ఆర్.వి.ప్రసాదరావు పాల్గొన్నారు.



రసీదులు తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ సీఐ రవికుమార్, వ్యవసాయ అధికారులు

ఆహార కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు

వీరఘట్టం: వినియోగదారులకు నాణ్యమైన సరుకులు విక్రయించాలని, ఎవరైనా ఆహార పదార్థాల కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి వినోద్‌కుమార్ నాయక్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని మూడు కిరాణా షాపుల్లో ఆయన మంగళవారం తనిఖీలు నిర్వహించారు. వారికెవరికీ లైసెన్సులు లేకపోవడంతో నోటీసులు అందజేశారు. ప్రతి వ్యాపారి లైసెన్సులు పొంది ఉండాలని, లైసెన్సు లేకుండా వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవన్నారు.